ప్రజాశక్తి
ఆదివారం 19 మే 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నివురు గప్పిన నిప్పులా పల్నాడు

- ఎవరు గెలిచినా ప్రత్యర్థులపై దాడులు?
- నిఘా వర్గాల హెచ్చరికతో మరో నెల పాటు బందోబస్తు
- పోలీసుల గుప్పిట్లో నాలుగు నియోజకవర్గాలు
- పారా మిలటీరి, ఎపిఎస్‌పి, ర్యాపిడ్ యాక్షన్ బలగాల గస్తీ

నరసరావుపేటలో మార్చ్ ఫాస్ట్‌చేస్తున్న కేంద్ర బలగాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కక్ష, కార్పణ్యాలతో పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలు అట్టుడుకుతున్నాయి. గత కొనేళ్లుగా రాజకీయంగా ఆధిపత్యం కోసం తరచూ ఘర్షణలు పడటం, బాంబు దాడులు, హత్యా సంఘటనలు కొనసాగుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించడం పరిపాటిగా మారింది. గత పదేళ్లకాలంలో టిడిపి, వైసిపి మధ్య రాజకీయ ఘర్షణలు జరుగుతున్నాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగాయి. గత ఐదేళ్లకాలంలో వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల దాడుల వల్ల నష్టపోయిన టిడిపి వారు ఆగ్రహంగా ఉన్నారు. తమ పార్టీ గెలిస్తే వైసిపి వారి సంగతి చూడలన్న కక్షతో టిడిపి వారు ఉన్నారు. వైసిపి గెలిస్తే టిడిపి వారిని గ్రామాల్లో లేకుండా తరిమేస్తారన్న భయం కూడా వెంటాడుతోంది. దీంతో టిడిపి, వైసిపి మధ్య ఎన్నికల్లో గెలుపుకోసం గట్టి పోరాటం జరిగింది. ఈనేపథ్యంలో ఈనెల 13న పోలింగ్ రోజున, తరువాత రెండు రోజుల పాటు జరిగిన అల్లర్లు జరిగాయి. టిడిపి, వైసిపి రెండు పార్టీల వారు కూడా ఎవరికి అవకాశం ఉన్న చోట వారు ప్రత్యర్థులపై దాడులకు తెగబడ్డారు. మాచర్ల, గురజాల, నర్సరావుపేట, పెదకూరపాడు నియోజక వర్గాలలో సమసాత్యకమైనవిగా గుర్తించినా ముందు జాగ్రత్తలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వచ్చాయి. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన దాడులపై కేంద్ర ఎన్నికల కమిషన్ సీరియస్ అయింది. పల్నాడుజిల్లాకు ఇప్పటికే 19 కంపెనీల పారా మిలటరీ బలగాలను జిల్లాకు పంపారు. వీరితో పాటు నాలుగు కంపెనీల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సుదళాలు మాచర్ల ప్రాంతానికి శుక్రవారం వచ్చాయి. అలాగే ఎపిఎస్‌పి బెటాలియన్ నుంచి ప్రత్యేక బలగాలను కూడా పల్నాడుకుపంపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుండటంతో అప్పటి వరకు బందోబస్తు కొనసాగించాలని తలపెట్టారు. అంతేగాక 4వ తేదీన ఫలితాలువచ్చిన తరువాత ఏపార్టీ గెలిస్తే ప్రధాన ప్రత్యర్థి పార్టీ నాయకులు,కార్యకర్తలపై దాడులకు పాల్పడే అవకాశంఉందని నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించాయి. 4వ తేదీన తరువాత హింసాత్మక ఘటనలు ఎక్కువగా జరుగుతాయని అందువల్ల ఫలితాలు తరువాత కూడా ఒక పక్షం రోజులు బందోబస్తును కొనసాగించాలని యోచి

2లో

కలెక్టర్ శ్రీకేష్ లత్కర్

ఎస్పి మల్లికా గర్గ్

పల్నాడులో కొత్త అధికారుల ఆగమనం

కలెక్టర్‌గా శ్రీకేష్‌లత్కర్, ఎస్పిగా మల్లికా గర్గ్

60 రోజుల్లో మూడో ఐపిఎస్ నియామకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేష్ లత్కర్ బాలాజీరావు, జిల్లా ఎస్పిగా మల్లిక గర్గ్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 ఐ.ఏ.ఎస్ బ్యాచ్ కు 2018 నుంచి 2019 వరకు గుంటూరు కమిషనర్‌గా పనిచేశారు. గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కో-ఆపరేషన్ డిపార్ట్మెంట్ మేనేజింగ్ డైరక్టరుగా, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గా కూడా పని చేశారు. ప్రస్తుతం మునిసిపల్ పరిపాలన శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన్ను బదిలీపై పల్నాడు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది. పల్నాడు జిల్లా ఎస్పిగా మల్లికా గర్గ్‌ను నియమించారు. 2022 ఏప్రియల్ నుంచి ఆమె ప్రకాశం జిల్లా ఎస్పిగా దాదాపు 20 నెలలు పనిచేశారు. తరువాత ఆమెను తిరుపతి ఎస్పిగా బదిలీ చేశారు. రాజకీయ వత్తిడితో ఆమెను కొద్దిరోజులకే అక్కడి నుంచి బదిలీ చేశారు. తాజాగా ఆమెను పల్నాడు ఎస్పిగా నియమిం చారు. పల్నాడు ఎస్పిగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని గత నెల 2న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ చేశారు. ఆ తరువాత ఎస్పిగా నియమి తులైన గరికపాటి బిందుమాధవ్‌ను ఎన్నికల కమిషన్ ఈనెల 16న సస్పెండ్ చేసింది. ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘర్షణలకు వైఫల్యంగా పరిగణిస్తూ బిందుమాధవ్‌పై తీవ్ర చర్య తీసుకున్నారు. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభంమైన గత రెండు నెలల కాలంలో ఎస్పి రవిశంకర్ రెడ్డి బదిలీ కాగా బిందుమాధవ్ సస్పెండ్ అయ్యారు. అలాగే పలువురు

2లో

రంగంలోకి సిట్ బృందం

నరసరావుపేటలో రికార్డుల పరిశీలన- అల్లర్లు జరిగిన ప్రాంతాల సందర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఈనెల 13,14,15 తేదీల్లో జరిగిన అల్లర్లపై నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం శనివారం విచారణ ప్రారంభించింది. సిట్ అధికారి ఎఎస్‌పి సౌమ్యలత బందం నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులో అల్లర్లు చెలరేగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గుంటూరు రోడ్డులోని టిడిపి-వైసిపి ఇరు పార్టీ నేతల

2లో

మూల్యం నాటికలో సన్నివేశం

5లో

ప్రేక్షకులను ఆకట్టుకున్న మూడు ప్రదర్శనలు

మూడోరోజుకు చేరిన కొలంకపురి నాటక కళాపరిషత్ ఆహ్వాన నాటికలు

బిఎల్ నారాయణ, రాయప్రోలు భగవాన్‌కు పురస్కారాలు

కొనసాగుతున్న అకాల వర్షాలు

ఆరేపల్లి ముప్పాళ్లలో పిడుగుపాటుకు రైతు మృతి - వేసవి తీవ్రత నుంచి తాత్కాలిక ఉపశమనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/ఈపూరు

గుంటూరు ,పల్నాడుజిల్లాల్లో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతంలో పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో పిడుగుపడి పొలంలో కర్రి హనుమంతరావు(40) రైతు మృతి చెందారు. గేదెలను కాసేందుకు పొలం వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఉరుములతో కూడిన వర్షం పడటంతో సమీపంలోని నరసింహస్వామి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించి పక్కనే చెట్టు కింద నిలబడ్డాడు. ఇంతలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. తెనాలిలో కురిసిన భారీ వర్షంకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తెనాలి బస్టాండ్‌లో నీటి తటాకం కన్పించింది. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, గుంటూరు, చేబ్రోలు, తెనాలి, పెదకాకాని, భట్టిప్రోలు,కొల్లూరు, దుగ్గిరాల

తెనాలిలో విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసుల వెనుక వర్షపునీరు

మండలాల్లో జల్లులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది.పల్నాడు జిల్లాలో కూడా ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. అరటి,మామిడి, పసుపు, బొప్పాయి తదితర పంటలు గాలులు, వర్షంకు దెబ్బతిన్నాయి. వేసవి తీవ్రత అధిక అవుతుందని భావిస్తున్న

2లో

రైతు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నేడు సిపిఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి సభలు జయప్రదానికి నాయకుల పిలుపు

ప్రజాశక్తి-తాడేపల్లి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం తాడేపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మునిసి పల్ కార్యాలయం సమీపంలో సుందర య్యకు నివాళి అర్పించడంతోపాటు, మజ్జిగ పంపిణీ కార్యక్రమముందని తెలిపారు. అనంతరం బోసు బొమ్మ సెంటర్ మేకా అమరారెడ్డి భవన్‌లో పెద్ద ఎత్తున సుందరయ్యకు నివాళి కార్యక్రమం ఉంటుం దని తెలిపారు. ఎన్నికలలో పనిచేసిన కార్యకర్తలతో గెట్‌టు గెదర్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఎ.రవీంద్రకుమార్

అవగాహన ఆధ్వర్యంలో హైపర్ టెన్సన్‌డే

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక జీవనశైలి వల్ల రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని డాక్టర్ ఎ.రవీంద్రకుమార్ అన్నారు. శనివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో వరల్డ్ హైపర్ టెన్షన్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ చాలా మందికి బిపి ఉందనే విషయం తెలుసుకునే లోపే ఆ వ్యాధి వల్ల ఏర్పడే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయన్నారు. అధిక రక్తపోటుని సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారని, తలనొప్పి, అలసట కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ముక్కు నుండి రక్తం కారటం, ఊపిరి తీసుకోలేకపోవటం, చూపు సక్రమంగా కనిపించకపోవటం, చాతినొప్పి వంటి లక్షణాలు బిపి సోకిన వారిలో ఉంటాయన్నారు. మద్యపానం, ఊబకాయం, ఏమీ పనిచేకుండా ఒకేచోట గంటల తరబడి ఉండటం, హైపోథైరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, శరీర శ్రమ లేకపోవటం లాంటి కొన్ని కారణాల వల్ల బిపి వస్తుందన్నారు. బిపి ఉన్న వారు తగు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని, ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోకూడదు అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సాయిరాం, చంద్రశేఖర్, శివశంకరరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - తాడికొండ

రైతుల నుండి మొక్కజొన్న కొని వ్యాపారి రూ.86లక్షలకు కుచ్చుటోపి పెట్టాడని రైతు సంఘం నాయకులు విమర్శించారు. శనివారం తాడికొండలోని బాధిత రైతులు మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన మర్రెడ్డి సాంబిరెడ్డి, తాడికొండకు చెందిన గోగినేని హరిబాబు, పొన్నెకల్లుకు చెందిన నెల్లూరు సుబ్బారావులను పరామర్శించారు. వారు మాట్లాడుతు తాము పండించిన మొక్కజొన్న పంటను గుంటూరు నగరం సంగడిగుంటకు చెందిన సముద్రాల గురునాథం ఫిబ్రవరి నెలలో కొనుగోలు చేసాడు. కొనుగోలు సమయంలో వ్యాపారి కొంత నగదు చెల్లించి ఇంకా రావలసిన నగదు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతూ, ప్రశ్నిస్తే చెక్కులు ఇచ్చాడని తెలిపారు. అయితే చెక్కులను బ్యాంకు లో వేయగా అకౌంట్లో నిల్వలు లేవని బ్యాంకు వారు తెలిపారని తమకు వ్యాపారి నుండి దాదాపు రూ.86లక్షలు రావాల్సి ఉందని నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెవివి ప్రసాద్, పి జమలయ్య, పచ్చల శివాజి, కొల్లి రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, పూర్ణచంద్రరావు మాట్లాడారు. బాధిత రైతులకు తాము అండగాఉంటామని, అధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

35 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరి మండలం విప్పటం -పెదవడ్లపూడి మార్గంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్సు అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ, పెనమలూరు తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసి పెదవడ్లమూడి పరిసరాల్లో కోళ్లఫారం నిర్వహాకులకు విక్రయించుకునేందుకు ఈ బియ్యంను తరలిస్తున్నట్టు జె.శ్రీరామ్ అనే వ్యక్తి తెలిపారు. శ్రీరాంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు విజిలెన్సు అధికారులు తెలిపారు. 35 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకున్నట్టు సిఐ శ్రీహరిరావు తెలిపారు.

దంత రోగాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులు కే.వి. ఆర్ కిషోర్ సారధ్యం జరిగిన శిబిరంలో వాకర్స్ సభ్యులు, గన్నవరం పట్టణ ప్రజలు దంత వైద్యుల సేవలను వినియోగిం చుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ అందరి సహకారంతో అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి తోడ్పాటునం దించాలని కోరారు. స్టార్ దంత వైద్యులు గుర్రం ధన ప్రకాష్, కాట్రగడ్డ సావేరి దంత వైద్య పరీక్షలు చేశారు. తొలుత వైద్యులు దంత సమస్యలు ఏవిధంగా ఏర్పడతాయనీ, వాటి నుండి ఎలా పరిష్కరించు కోవచ్చునో వివరించారు. శిబిరాన్ని గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య ప్రారంభించి వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ న్యాయవాది తిరివీధి వెంకయ్య, ఉపాధ్యక్షులు నిడమర్తి నాగేశ్వరరావు, ఇంటర్ నేషనల్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు కే.యన్.బాబూరావు, కార్యదర్శి డాక్టర్ లోయ సురేంద్ర, కోశాధికారి బోకినాల కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ధనియాల నాగరాజు, మెడికల్ ఇంచార్జులు వడ్లమూడి విజయకుమార్, పి. ప్రసాద్, ఆంజనేయులు జాస్తి ప్రసాద్ పాల్గొన్నారు.

దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

ఈనెల 24వ తేదీ నుండి జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి గూగుల్ మీట్ ద్వారా ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం 8,968 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 1,373 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ ఇంటర్ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సీనియర్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టిపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్లో భద్రపరచి పరీక్షా కేంద్రాలకు జాగ్రత్తగా తరలించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఇన్విజిలేటర్లు విధులను నిర్వహించేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు కూడా పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద తగినంత మందులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తపాలా కార్యాలయం ద్వారా జవాబు పత్రాలను స్పీడ్ పోస్ట్లో పంపేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ గూగుల్ మీట్లో డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు, ఆర్ఐఒ రవికుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, డిఇఒ తహెరా సుల్తానా, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ప్రసాద్ శాస్త్రి, రవి కిరణ్, వెంకటరమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ (కింద)

న్యాయవ్యవస్థ పరిరక్షణకు నడుం కట్టాలి

- 'ప్రబీర్ పుర్కాయస్థ' సభలో వక్తలు
- 'అలుపెరుగని పోరాటం' ఆవిష్కరణ

వార్త మెయిన్లో

నివురుగప్పిన నిప్పులా పల్నాడు

(మొదటిపేజీ తరువాయి)

స్తున్నారు. ప్రస్తుతం పలుగ్రామాల్లో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. అధికారులు ఏమాత్రం అలసత్వం వహించినా దాడులు, ప్రతిదాడులు జరిగే ప్రమాదం ఉందని అందువల్ల ముందుగానే బందోబస్తు నెల పాటు కొనసాగించాలని నిఘా వర్గాలు సూచించాయి. పల్నాడులో ఘర్షణలను నియంత్రించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డిజిపి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పల్నాడులో కొత్త అధికారుల ఆగమనం

(మొదటిపేజీ తరువాయి)

డిఎస్‌పిలు, సిఐలపైనా చర్యలు తీసుకున్నారు. పలు వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను కూడా ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. మరో వైపు పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు,దాడులకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇప్పటికీ సీరియస్‌గానే ఉంది. ఎన్నికల ఫలితాల తరువాత కూడా ఘర్షణలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల హెచ్చరికలతో ప్రత్యేక బలగాలను పల్నాడుకు పంపుతున్నారు. తాజాగా శనివారం కూడా జిల్లాకు కొన్ని బలగాలు వచ్చాయి. ఇప్పటికే పారాంమిటటరీ, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, ఎపిఎస్‌పి బెటాలియన్, ఎఆర్ పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా పహారా కాస్తున్నాయి.

రంగంలోకి సిట్ బృందం

(మొదటిపేజీ తరువాయి)

హాస్పిటల్ ప్రాంతంలో పర్యటించి కొన్ని వివరాలు సేకరించారు. అనంతరం 2 వ పట్టణ పోలీసు స్టేషన్ కు వెళ్లి సిఐ ఆవుల భాస్కర్‌ను విచారించడంతో పాటు ఎన్నికల వివాదం నేపథ్యంలో ఎంత మందిపై కేసులు నమోదు చేశారు ఎంతమందిని బైండోవర్ చేశారు రిమాండ్ కు తరలించిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. శనివారం రాత్రి 10 గంటల వరకు విచారణ కొనసాగుతూనే ఉంది. ఆదివారం కూడా ఆమె నర్సరావుపేటలోనే ఉండి విచారణ కొనసాగించనున్నారు. 1వ పట్టణ గ్రామీణ పోలీసు స్టేషన్ లో కూడా రికార్డులు పరిశీలించి ఆయా పోలీసు స్టేషన్ల సిబ్బందిని సిట్ బృందం విచారణచేయనున్నట్లు సమాచారం.

పల్నాడులో కొనసాగుతున్న అల్లర్ల కేసుల విచారణ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో గురజాల నియోజకవర్గంలో 100 కు పైగా కేసులు 192 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అత్యధికంగా దాచేపల్లి మండలం 70, పిడుగురాళ్ల మండలం 62 మందిపై కేసులు నమోదు చేయగ 67 మందిపై ఐపిసి 307, 324, 323 కింద కేసు నమోదు చేసినట్లు అదేవిధంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో 34 కేసులలో 70 మంది నిందితులు గుర్తించినట్లు పెదకూరపాడు నియోజకవర్గంలో 5 కేసులు నమోదు కాగా 99 మంది నిందితుల గుర్తించినట్లు నరసరావుపేట నియోజక వర్గంలో 20 పైగా కేసు 60 మంది నిందితులను గుర్తించి నట్లు నరసరావుపేట 1వ పట్టణ పోలీసు స్టేషన్ లో జరిగిన గొడవలకు సంబంధించి 11 మందిపై ఐపిసి 147, 148, 324 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. నమోదైన ఎఫ్ఆర్ లలో మరికొన్ని పేర్లు చేర్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కొనసాగుతున్న అకాల వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

తరుణంలో వాతావరణంలో మార్పు వచ్చి అకాల వర్షాలు కురవడం, చల్లటి వాతావరణం ఏర్పడటంతో పలు ప్రాంతాల ప్రజలు సేదతీరారు. గత ఏడాది మే 17, 18 తేదీల్లో జిల్లాలో 43 డిగ్రీల నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. 34 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత గరిష్టంగా నమోదు అవుతుంది. వర్షం కురిసి ఆకాశం మేఘావృత్తం అయిన ప్రాంతాల్లో కేవలం 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది.ఈ ఏడాది నైరుతీ రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది.అంతేగాక గత వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల అడపాదడపా వర్షాలు నమోదు కావడం వల్ల ఎండల తీవ్రత తగ్గింది. వర్షం కురవడం వల్ల వేడిగాలులు బాధ నుంచి ప్రజల ఉపశమనం పొందారు. గతేదాది ఇదే సమయంలో వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ ఏడాది వర్షాల ప్రభావం, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వేసవి తీవ్రత అంతగాలేదని ప్రజలు సంతోషంగాఉన్నారు. వాతావరణంలో మార్పు వల్ల పల్నాడు జిల్లాలో ప్రజలకు వేసవి కాలంలో తాత్కాలిక ఉపశమనం లభిస్తుస్తోంది. చాలాప్రాంతాల్లో ఉక్కపోత వల్ల వృద్దులు బాగా ఇబ్బంది పడుతున్నారు.

అధికారులపై ఈసి అభిశంసన

7 వీక్షణం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి పోలింగ్ ముగిసిన తరువాత కూడా పల్నాడు జిల్లాలో అధికారులపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. పాలనాపరంగా పలు విమర్శలను ఎదుర్కొంటున్న గుంటూరు రేంజి ఐజి పాలరాజ్, పల్నాడు ఎస్‌పి రవి శంకర్ రెడ్డిని గత నెల 2వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. దేశంలో మార్చి 16న ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులోకి వచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చిలకలూరిపేట పర్యటన సందర్భంగా మార్చి 17న అసాధారణ సంఘటనలకు బాధ్యులుగా పేర్కొంటూ ఎన్నికల కమిషన్ ఐజి పాలరాజ్‌ను, ఎస్‌పి ని బదిలీ చేసింది. అంతేగాక శాంతిభద్రత పరిరక్షణలో కూడా పల్నాడు ఎస్‌పి రవిశంకర్ రెడ్డి పనితీరు సరిగా లేదని గతంలోనే అనేక విమర్శలు వచ్చాయి. గత మార్చిలో మాచర్ల వద్ద ఒక కారు దగ్ధం ఘటనపై ఎస్‌పిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వయంగా పిలిచి వివరణ తీసుకున్నారు. పలువురు టిడిపి కార్యకర్తలు హత్యకు గురికాగా మరికొంతమంది తీవ్రంగా గాయపడినా పోలీసులు సకాలంలో స్పందించక పోవడంపై టిడిపి చాలా కాలంగా పల్నాడులో గత ఎస్‌పి రవిశంకర్ రెడ్డిపై పలుమార్లు ఫిర్యాదులు చేసింది. ఎన్‌డిఏ తో పొత్తు తరువాత నేరుగా పలు ఘటనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడంతో టిడిపి సఫలీకృతం అయింది. అంతేగాక ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు సంబంధించి కూడా పోలీసుశాఖ ఉదాశీనతపై ఎన్‌డిఏ కూటమి నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన ఎన్నికల కమిషన్ ఎస్‌పి, ఐజిపై బదిలీ వేటువేసింది. అలాగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, మంగళ,బుధవారాల్లో పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు, హింసాత్మక ఘటనలు జరగడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ సీరియస్ అయింది. అల్లర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందాలు (సిట్) ఏర్పాటు చేసి తక్షణం బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.అల్లర్లను నియంత్రించడంలో వైఫల్యం చెందారన్న కారణంతో పల్నాడు జిల్లా ఎస్‌పి గరికపాటి బింధుమాధవ్‌ను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. ఘర్షణలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పంపిన నివేదికపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. తగినంత బలగాలు లేనందువల్ల అల్లర్లు జరిగాయని కలెక్టర్ పేర్కొడాన్ని ఈసి తప్పుపట్టింది. ముందస్తు అప్రమత్తత కనబర్చనందుకు ఆయన్ను బదిలీ చేశారు. కలెక్టర్ బదిలీతోపాటు శాఖపరమైన విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఎస్‌పితో పాటు పలువురు డిఎస్‌పిలు, సిఐలను సస్పెండ్ చేసిన ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. పల్నాడు జిల్లాలో పలువురు సిఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రత్యేకంగా కేంద్ర బలగాలను పంపినా, ముందుగానే నాలుగు నియోజకవర్గాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినా దిగువ స్థాయి అధికారులు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేసి శాంతిభద్రతలను నిర్లక్ష్యం చేశారని ఉన్నతాధికారులు ఈసికి నివేదించారు. దీంతో ఈసి మూకుమ్మడిగా అధికారులపైవేటు వేసింది. పల్నాడు ప్రాంతంలో అల్లర్లు జరుగుతాయని తెలిసినా డిఎస్‌పిలు, సిఐ,ఎస్ఐలు అధికార పార్టీకి సానుకూలంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి.

(ఎ.వి.డి.శర్మ)

దీటుగా ప్రచారం నిర్వహించాం : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ గెలుపు కోసం ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహించామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రాత్రి తాడేపల్లి సుందరయ్యనగర్‌లో జరిగిన ఎన్నికలలో కలసి వచ్చిన వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. భవిష్యత్‌లో సాంస్కృతిక రంగంలో కృషి కొనసాగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి. కృష్ణయ్య, పి.మురళీకృష్ణ, వై. అచ్యుతరావు, వై. సుబ్బారావు, బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, డి. యోహాన్, సి.హెచ్ రామిరెడ్డి, సుభాషిణి, కృష్ణ, ప్రవల్లిక, వీరబ్రహ్మం, వి. బెనర్జీ, ఎస్‌కె బాషా, కె.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో నిర్వహించిన ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న పి.మురళీకృష్ణ

తాడేపల్లి సిఎం క్యాంప్ ఆఫీస్ దగ్గర నడిరోడ్డు పై పార్కింగ్

ప్రజాశక్తి-తాడేపల్లి

ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్న సరే పట్టీ పట్టనట్టు ఓ వ్యాపారి వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

హనుమద్ వాహనంపై ఊరేగిన శ్రీ భావదేవుడు

27 వరకు బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -పొన్నూరు

స్వర్ణపురిలో కొలువుదీరిన శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి నవాహిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 27 వ తేదీ వరకు జరగనున్నాయి. శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి పంచామృత స్నాపన, తిరువంజోనోత్సవము నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీ స్వామి వారిని హనుమద్ వాహనంపై గ్రామోత్సవము నేత్రపర్వంగా నిర్వహించారు. ఉపప్రధాన అర్చక పరాశరం రఘునాథ్ బాబు పర్యవేక్షణలో, దేవస్థానం సహాయక కమిషనర్, కార్య నిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

అకాల వర్షాలు .. జలమయమైన ఆర్టీసి బస్టాండ్

ప్రజాశక్తి-తెనాలి

రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ జల మయమైంది. ప్రయాణీకులు బస్సులు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు చెప్పనలవి కావు. ప్రయాణీకుల నుంచి ముక్కుపిండి చార్జీలు వసూలు చేస్తున్న ఆర్టీసి యాజ మాన్యం వారికి కనీస సౌకర్యాలు కల్పించ టంలో విఫలమైందన్న విమర్శలున్నాయి. తెనాలి డిపోలో నెలకొన్న పరిస్థితులకు సంబందించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసి బస్టాండ్ ఆవరణ, డిపో గ్యారేజి ఆవరణ లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. గత కొన్నేళ్ళుగా ఈ సమస్య

తెనాలిలో విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసుల వెనుక వర్షపునీరు

డిపోను వెంటా డుతూనే ఉంది. గ్యారేజిలో పరిస్థితి కొంత మేర చక్కబడినా బస్టాండ్‌లో మాత్రం ఈ సమస్య ప్రయాణీకులను వేదిస్తుంది. డిపోలో పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ రెండు ఉన్నాయి. కొత్త బస్టాండ్‌లో చెరుకుపల్లి, పొన్నూరు, బాపట్ల, భట్టిప్రోలు, రేపల్లె ప్రాం తాలకు వెళ్లే బస్సులు ఉంటాయి. ఈ ప్రాంతం మెరకలో ఉండటంతో దీనికి ఎలాంటి ఇబ్బంది లేదు. పాత బస్టాండ్ మాత్రం మొదటి నుంచీ పల్లపు ప్రాంతంలోనే ఉంది. ముఖ్యంగా విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసులు, మంగళగిరి, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, నందివెలుగు నారాకోడూరు మీదుగా గంటూరు వైపు వెళ్లే బస్సులు ఉండే ప్రాంతం పూర్తిగా పల్లం. కొద్ది పాటి వర్షానికే భారీగా నీరు నిలుస్తుంది. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బస్టాండ్‌ను వర్షపు నీరు చుట్టుముట్టింది. దీంతో ప్రయాణీకులు నానా తంటాలు పడ్డారు. వర్షపు నీటిలోనే బస్సులు నిలవడం, ఎక్కేందుకు కనీసం ప్లాట్‌ఫాం వంటి సౌకర్యం కూడా లేకపోవటంతో ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. మహిళ ఇబ్బందులు చెప్పనలవి కావు. గతంలో డిపో ఆవరణలో తూర్పు ఈశాన్యం మూలన ఇంజన్ ఏర్పాటు చేసి, నీటిని బయటకు పంపేవారు. ప్రస్తుతం అలాంటి ప్రయత్నం కూడా చేయటం లేదు. అలాగని దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగానూ అడుగుడు వేయటంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో మెరకలు తోలించి, నీరు నిలువకుండాచర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఇదే విషయంపై డిపో మేనేజర్ రాజశేఖర్ వివరణ కోరేందుకు ఫోన్‌లో పలుమార్లు సంప్రదించినా ఆయన స్పందించలేదు.

తెనాలి బస్టాండ్‌లో భారీగా నిలిచిన వర్షపు నీరు

చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

వేసవి కాలంలో మండుటెండల వడగాల్పుల నుండి ప్రజలకు ఈ మధ్య కాలంలో పడిన వర్షం వలన కొంత ఉపశమనం లభించింది. మరలా గత 10 రోజులగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. శనివారం మధ్యాహ్నం పట్టణం, పరిసర ప్రాంతాలలో కురిసిన వర్షం వాతా వరణాన్ని బాగ చల్లబర్చింది. వాస్తవంగా ప్రతి ఏడాది మే నెల కాలంలో తీవ్ర ఎండల వలన ఈ ప్రాంత వాసులు చాల ఇబ్బంది పడుతుంటారు. ఈ సంవత్సరం మార్చి, ఏప్రియల్ నెలలో ఎండల తీవ్రత ఉంది. మే నెలలో మాత్రం కొంత మేరకు పడుతున్న వర్షాలతో ఊరట చెందుతున్నారు. బోర్ల క్రింద వ్యవసాయం చేసే రైతులు వాతవారణం అనుకూలంగా ఉండటంతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. వాతావరణశాఖ వారు త్వరలోనే రుతుపవనాలు రానున్నట్లు ప్రకటించటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాచర్లలో..



జగ్గాపురం జెడ్‌పి హైస్కూల్ లో 1987-1992 బ్యాచ్ విద్యార్థుల చిత్రం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలంలోని జగ్గాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో చదివిన 1987-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఆ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారు పాఠశాలలో చదువుకున్నప్పటి విషయాలను గుర్తుచేసుకున్నారు. తమ అనుభూతులు నెమరు వేసుకున్నారు. ఇందులో భాగంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని ఉషశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు అబ్బరాజు సాంబ శివరావు, తెలుగు ఉపాధ్యాయులు బత్తుల నాగేశ్వరరావు, రైటర్ వలేరు రాజారావు, విద్యా కమిటి చైర్మన్ దావల రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నూజెండ్ల

నూజెండ్లలోని మండల పరిషత్ కార్యా లయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి జయరామిరెడ్డి అధ్యక్షత వహించారు. మండలంలో జరిగిన అభివృద్ధిపై సభ్యులు, అధికారులు చర్చించారు. సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

చేరెడ్డి గోపాల్ రెడ్డి ఆరోగ్యం విషమంగానే

ప్రజాశక్తి -రెంటచింతల

ఐసీయూలో గోపాల్ రెడ్డి

మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చేరెడ్డి గోపాల్ రెడ్డి ఆరోగ్యం శనివారం రాత్రికి విషమంగానేఉందని కుటుంబ సభ్యులు తెలిపారు ఈనెల 13న సార్వ త్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసిపి టిడిపి వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో తలకు తీవ్ర గాయమైంది. గురజాల ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆరు రోజులైనప్పటికీ మనుషులను గుర్తుపట్టడం,మాట్లాడడం గాని లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

32 మంది పై కేసులు నమోదు

ప్రజాశక్తి - రెంటచింతల

ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా మండలంలో వివిధ గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలకు సంబంధించి 32 మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం ఇందులో రెంటాల గ్రామంలో జరిగిన భౌతిక దాడులకు సంబంధించి 9 మందిపై కేసు నమోదు చేశారు తుమ్మరకోట పాల్వాయి గేటు జట్టిపాలెం గోలి గ్రామాల్లో ఈవీఎంల ధ్వంసం తో పాటు చెదురుమదురు సంఘటనలకు బాధ్యు లైన వారిపై కేసులు నమోదు చేశారు నిందితులను అరెస్టు చేయడానికి స్పెషల్ టీం ఏర్పాటు చేశారు నేటికీ 144 సెక్షన్ దుకాణాలు మూయించి గ్రామాల్లో పికెట్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క పికెట్‌లో ఐదుగురు కానిస్టేబుళ్లను ఉంచారు.

కొనసాగుతున్న 144 సెక్షన్.. చిరువ్యాపారుల అవస్థలు

- కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనసాగనున్న 144 సెక్షన్
- పనుల్లేక కార్మికులకు ఇబ్బంది
- నిత్యావసరాల ధరలు పెంచి దోచుకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతుంది. పోలింగ్ రోజు జరిగిన హింసాత్మక ఘటనల దృష్ట్యా కౌంటింగ్

నరసరావుపేటలో దుకాణాలు మూసి వేయిస్తున్న పోలీసులు

మాచర్లలో..

ప్రక్రియ పూర్తయి ఫలితాలు విడుదల అనంతరం ఏమైనా వివాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్న అను మానం నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమలు పటిష్టంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల జూన్ 4 న ఫలితాలు విడుదల అయిన అనంతరం కూడా కొన్ని రోజుల పాటు 144 సెక్షన్ అమ

నరసరావుపేటలో..

లయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో, రోడ్డు వెంట తోపుడు బండిపై చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే వారిపై, రోడ్డు వెంట తాత్కాలిక వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారిపై 144 సెక్షన్ అమలు ప్రభావం పడుతోంది. పట్టణంలోని ప్రధాన కూడలి మల్లమ్మ సెంటర్ లో ప్రతి ఉదయం వందలాది మంది రోజు వారీ కూలీలు అక్కడకు వచ్చి నిల్చొని ఉంటారు. ఆయా పనులకు అవసరమైన వ్యక్తులను తీసుకువెళుతుంటారు. ఎన్నో ఏళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతుంది. 144 సెక్షన్ అమలులో ఉండటంతో మల్లమ్మ సెంటర్ లో దుకాణాలు కూడా మూసి వేస్తున్న నేపథ్యంలో రోజు వారి కూలీలను సైతం కొన్ని రోజుల పాటు కూడలికి రావొద్దని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో, రోజు వారీ కూలీలు పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదిలా ఉంటే, కొంత మంది వ్యాపారులు చిల్లర సరుకుల ధరలను పెంచేస్తున్నారు. నరసరావుపేటలో ప్రధానంగా టిడిపి-వైసిపి అభ్యర్థుల హాస్పిటల్స్ మార్గంలో ప్రజలు ఎవరు రాకుండా ముళ్ల కంచెలు వేయడం పోలీసులు పహారా కొనసాగుతోంది. ప్రధానంగా ఆయా చోట్ల 144 సెక్షన్ అమలు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వారం కొంత సడలింపు రావటంతో ఉదయం నుండి సాయంత్రం వరకు షాపులు తీసి వ్యాపారాలను కొనసాగించారు. మాచర్ల టౌన్ ప్రత్యేక పోలీసుల రక్షణ వలయంలోనే ఉంది. టౌన్‌లోకి వచ్చే వారిని పోలీసులు పరిశీలన చేసి పంపుతున్నారు.

కొంత సమయమైనా షాపులు తెరవనివ్వండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడులో 144 సెక్షన్

పెదకూరపాడులో..

సడలించిన అంక్షలు

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణంలో గత బుధవారం నుండి 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. శనివారం కూడా ఈ సెక్షన్ అమలు చేశారు. అయితే, శనివారం కొంత మేరకు అంక్షలు సడలించటంతో వ్యాపార సంస్థలు యధావిధిగా వారి వ్యాపారాలను కొనసాగించాయి. గత వారం రోజులుగా వ్యాపారులు ఎన్నికలు అనంతరం ఘర్షణల వలన తమ వ్యాపారాలు నిర్వహించుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడ్డారు. శని

రెండు రోజుల నుంచి అమల్లో ఉంది. శనివారం కూడా షాపులు మూసివేశారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారం లేక యజమానులు రోజువారి నిర్వహణ భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తోపుడు బండ్లు, రోడ్ల వెంట వ్యాపారం నిర్వహించే వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రోజు మొత్తం కాకుండా కొంత సమయమైనా అధికారికంగా షాపులు తెరుసుకోవచ్చని ప్రకటించాలని కోరుతున్నారు.

ఒత్తిడి లేని విద్యా బోధనకు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్

- డాక్టర్ నాగోతు ప్రకాశరావు
- స్కూల్ ప్రారంభోత్సవ రేపు
- హాజరు కానున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పంచాయతి పరిధిలో తమచే నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కార్యదర్శి ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగోతు ప్రకాశ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, గౌరవ అతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంక టేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. 5 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన తరగతి గదులు,క్రీడా ప్రాంగణం, సిబిఎస్ఇ సిల బస్ తో నిర్వ హించనున్న తమ పాఠ శాలలో అనుభభం కలి గిన అధ్యాపకులచే ఒత్తిడి లేని సులభతర విద్యా బోధనకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకాశరావు తెలిపారు. నర్సరీ నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన ఉంటుందని విద్యార్థులలో సృజనాత్మక తను పెంపొందించేందుకు క్రీడలు, యోగా తదితర కార్యకలాపాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు 2 నుంచి 8వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అవ గాహనా సదస్సు, స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన వారికి జస్టిస్ వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అంద జేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసు కోవాలని కోరారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు
- నరసరావుపేట మండలంలోని జెఎన్‌టియు కళాశాలలో వేర్వేరు కౌంటింగ్ కేంద్రాలు
- ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద భారీ బందోబస్తు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో వచ్చే నెల 4 వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా చూసేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పంచాయతి పరిధిలో గల జె.ఎన్. టి.యు కళాశాలలో పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మాచర్ల, నరసరావుపేట హింసాత్మక ఘటనలు మినహా మిగిలిన నియోజకవర్గాలలో స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం జూన్ 4 న తేలనుంది. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. 4 న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు జె.ఎన్.టి.యు కళాశాలలో వేరు వేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లెక్కింపులో ఎటువంటి జాప్యం జరగకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసు కుంటున్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు లెక్కించనున్నారు.ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజధానిలో నర్సరీల పునరుద్ధరణ జరిగేనా..?

ప్రజాశక్తి-తుళ్లూరు

ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా రాజధాని అమరావతిలో నర్సిరీ లను ఏర్పాటు చేశారు.టిడిపి ప్రభుత్వ హయాంలో రాజధాని ప్రాంతాన్ని' హరిత అమరావతి' గా మార్చాలన్న సంకల్పంతో మండలంలో ఐదు చోట్ల నర్సరీ లను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యత ను అటవీశాఖకు అప్పగించారు. వెలగపూడి, లింగాయపాలెం, అబ్బరాజుపాలెం, అనంతవరం, వెంకటపాలెం వద్ద సి ఆర్ డి ఎ భూములు కేటాయించడంతో నర్సరీలు ఏర్పాట య్యాయి. రాజధాని నిర్మాణానికి భూములు ఇవ్వడంతో వ్యవసాయ పనులు కోల్పోయిన కూలీలకు నర్సిరీల ద్వారా ఉపాధి కల్పిస్తామని అటవీశాఖ అధికారులు చెప్పడంతో సి ఆర్ డి ఎ భూములు కేటాయించింది. నర్సరీలలో మొక్కలు పెరిగేటప్పటికి ప్రభుత్వం మారింది.వైసిపి అధికారంలోకి వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో నర్సరీలలో కొన్ని మొక్కలు చనిపోగా మరికొన్ని మొక్కలు పెరిగి చెట్లయ్యాయి.నర్సరీల నిర్వహణ బాధ్యత నుంచి అటవీశాఖ తప్పుకోవడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో క్రమేపీ నర్సరీ లు మూత పడ్డాయి. మూతపడ్డ నర్సరీల వైపు అటవీశాఖతో పాటు సిఆర్‌డిఎ అధికారులు కన్నెత్తి చూడడం లేదని వెలగపూడికి చెందిన నర్సరీ కార్మికురాలు భూలక్ష్మి చెప్పింది. నర్సరీలు ఉంటే రాజధానిలోని వ్యవసాయ కూలీలకు కూలి పనులు కొంత మేర దొరికేవని, వాటిని మూసి వేయడంతో అవి కూడా లేకుండా పోయాయని వాపోయింది.

రాజధాని ప్రాంతం అనంతవరంలో అడవిని తలపిస్తున్న నర్సరీ

నర్సరీలను పునరుద్ధరించాలి : సిపిఎం

రాజధాని ప్రాంతంలో నర్సరీ లను తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం కోరింది.సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి శనివారం తుళ్లూరులో మాట్లాడుతూ, నర్సరీల ద్వారా ఉపాధి పొందేది దళితులు, ఇతర పేదలేనని అన్నారు. నర్సరీలను తీసివేయడాన్ని నిరసిస్తూ సిపిఎం రాజధానిలో ఆందోళనలు చేసిందని గుర్తుచేశారు. రాజధాని నిర్మాణం నేపథ్యంలో వ్యవసాయ పనులు లేక, ఉపాధి అవకాశాలు మృగ్యమై పేదల జీవనం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. రాజధానితో పాటు రాష్ట్రం లోని ఇతర ప్రాంతాలకు నర్సరీల లోని మొక్కలు, చెట్లను తరలించవచ్చని, ప్రభుత్వం తక్షణమే వాటి పునరుద్ధరణ పై దృష్టి సారించాలన్నారు

ప్రేక్షకులను ఆకట్టుకున్న మూడు ప్రదర్శనలు

- మూడోరోజుకు చేరిన కొలంకపురి నాటక కళాపరిషత్ ఆహ్వాన నాటికలు
- బిఎల్ నారాయణ, రాయప్రోలు భగవాన్‌కు పురస్కారాలు

ప్రజాశక్తి-తెనాలి

కొలంకపురి నాటక కళాపరిషత్, వైకె నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ గ్రామం కొలకలూరు చిన్న రథశాల వద్ద వల్లేపల్లి వెంకట్రామయ్య కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న దశమ ఆహ్వాన నాటిక పోటీలు శనివారం మూడో రోజుకు చేరాయి. ప్రతి రోజు రాత్రి వేళ ప్రదర్శిస్తున్న నాటికలను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి వస్తున్న ప్రేక్షకులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వరుసగా మూడు నాటికలను తిలకిస్తున్నారు. ఆహార్యం, అభినయంతోపాటు రంగాలంక రణ, సంగీతం అన్ని ప్రేక్షకుల జేజేలందుకుం టున్నాయి. సభా కార్యక్రమానికి హైదరాబాద్ కథక్ కళాక్షేత్రానికి చెందిన కథక్ అంజిబాబు, తాళ్లూరి అజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కళ పత్రిక సంపాదకులు మహ్మద్ రఫి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా పరిషత్ ఉపాధ్యక్షులు సుద్దపల్లి మురళీధర్, వైకె నాటక పరిషత్ అధినేత బొప్పన నరశింహారావు, పరిషత్ రథసారథులు షేక్ జానిభాషా, జివిన్ ప్రసాదరెడ్డి, నటులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైకె నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని భీమవరం చైతన్య కళాభారతి అధినేత రాయప్రోలు భగవాన్, జిఎల్‌ఎన్ మూర్తి స్మారక పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయులు బిఎల్ నారాయణకు అందించి, సత్కరించారు. కార్యక్రమంలో గోపరాజు విజయ్, ఎస్.శరత్‌వెంకయ్య, మాజీ సర్పంచ్ వి.వరప్రసాదరావు, కాంతారావు, పరిషత్ అద్యక్షులు గోపరాజు రమణ పాల్గొన్నారు.

ఇంద్రప్రస్థం నాటికలో సన్నివేశం

నాన్న గొప్పతానికి దర్పణం ఇంధ్రప్రస్థం

మూడోరోజు తొలి ప్రదర్శన ఇంద్రప్రస్థం నాటిక కుటుంబంలో తండ్రి విశిష్టత ఏమిటన్నది స్పష్టం చేసింది. గోపి సత్యప్రసాద్(స్నిగ్ధ) రచనకు ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. కథాంశాన్ని పరిశీలిస్తే సర్వేశ్వరరావు ఒక మంచి వ్యక్తి, కుటుంబానికి దిక్సూచి. కొడుకు ఒక అమ్మాయిని ప్రేమించిన విషయం తెలుసుకున్న ఆయన ఏమాత్రం తొందరపడకుండా అమ్మాయి తండ్రి గురించి ఆలోచిస్తాడు. తన లాంటి తండ్రే కదా, పైగా ఆడపిల్ల తండ్రి ఎంత తల్లిడిల్లిపోతాడోనని ఆలోచన ఒక వైపు, మరో వైపు ప్రేమలో మునిగి తేలుతున్న కుమారుడికి ఎలాంటి తప్పిదానికి ఆస్కారం లేకుండా జాగ్రత్త వహిస్తుంటాడు. చివరకు అమ్మాయి తండ్రిని కూడా ఒప్పించి, వారి వివాహం జరిపించి కుటుంబంలో తండ్రిగా గౌరవాన్ని నిలబెట్టుకోవటం ఇతివృత్తంగా నాటిక సాగింది.

మహిళలపై వివక్షకు ఎదురీత మూల్యం

సమాజంలో మహిళలపై అడుగడుగునా కనిపించే ఆంక్షలకు ఎదురొడ్డి హక్కులను కాపాడుకోవటమే ఇతివృత్తంగా మూల్యం నాటిక సాగింది. పుట్టుకతో మొదలు పెంపకం, చదువు, ఉద్యోగం, వివాహం అన్నింటా మహిళపై ఆంక్షలే. వివాహం తరువాత ఆమెపై సర్వహక్కులూ భర్తవేననటం వివక్షేనని, మనిషిని మనిషిగా గుర్తించకపోగా ఆమెపై హింసాత్మక, ఆంక్షల దోరణితో వ్యవహరించటం మహిళ హక్కులను హరించటమేనని, ఆ పరిణామాలకు ఎదురొడ్డి గెలిచిన పరిణామమే మూల్యం నాటిక సందేశం. హైదరాబాద్‌కు చెందన గోవాడ క్రియేషన్స్ ప్రదర్శనకు సింహప్రసాద్ రచన, డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వ బాధ్యతలు వహించారు.

మూడో ప్రదర్శనగా రాజు గారి గోచి

కళానికేతన్ వీరన్నపాలెం వారి ప్రదర్శన 'రాజు గారి గోచి' నాటికకు రచన నారిపెద్ది శివన్నారాయణ కాగా సిహెచ్ సాయిబాబు దర్శకత్వం వహించారు. కథాంశంలోకి వెళితే ఓ చిన్న దీవి, కేవలం ఆరువేల జనాభా, వారిని పన్నుల రూపంలో పీడించే రాజు. అది చాలదన్నట్లు పేదలను నిలువునా దోచుకునేందుకు జూదశాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఓ హత్య జరుగుతుంది. రాజు ఆ హంతకుడికి ఉరి శిక్ష వేస్తాడు. దానిని అమలు చేయలేక జీవిత ఖైదుగా మార్చి, ఖైదీకి మూడు పూట్లా భోజనం, ఓ బటుడు కాపలా ఉండటం ఖజానాపై ఆర్థిక భారంగా పరిణమిస్తుంది. చివరకు ఆ ఖైదీని విడిచి పెట్టి పారిపొమ్మంటే, ఊరికే కూర్చుని తినటానికి అలవాటు పడిన హంతకుడు దానికి నిరాకరిస్తాడు. దీంతో వాడిని ఆ దీవి దాటించి వదిలేస్తారు. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాడిపైనే ఆధారపడి జీవించే తల్లిని దృష్టిలో ఉంచుకుని నేరస్తుడు చేసిన నేరం కంటే, కుటుంబం నష్టపోయే విదానాన్ని అలోచించి నిందితుడిని విడిచిపెట్టడం కథాంశంగా సాగింది.

జిఎల్‌ఎన్ మూర్తి స్మారక పురస్కారం అందుకుంటున్న నారాయణ, వైకె నాగేశ్వరరావు స్మారక పురస్కారం అందుకుంటున్న భగవాన్

జ్యోతిప్రజ్వలన చేస్తున్న కథక్ అంజిబాబు

పవర్ లిఫ్టింగ్ సెలక్షన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జిల్లా పవర్ లిఫ్టింగ్ సెలక్షన్ పోటీలు

ప్రజాశక్తి మంగళగిరి

గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి పట్టణంలో గల గుమ్మడి పుల్లేశ్వరరావు జిమ్ సెంటర్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ సెలక్షన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్స్ 20 మంది, పురుషుల పవర్ లిఫ్టర్స్ 30 మంది పాల్గొన్నారు. ఈ సెలక్షన్ పోటీల నిర్వహణకు జిమ్ కోచ్ జి వెంకటేశ్వరావు సమకూర్చారు. ఈ పోటీల్లో సెలెక్ట్ అయిన పవర్ లెటర్లు ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జి వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షురాలు బి చంద్రిక, పి భాస్కరరావు, బి ప్రసాద్, సహాయ కార్యదర్శులు జి సాయి రేవతి, ఎండి మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఏ పవన్ కుమార్, ఎస్కే సుభాని, రాజు, సలోమి పాల్గొన్నారు.

సిబిఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో

లైన్స్ మాంటిస్సోరి పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

పదవ తరగతి సిబిఎస్ఈ ఫలితాల్లో పెదనందిపాడు లైన్స్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు 17 మంది విద్యార్థులు హాజరు గాక అందరూ ఫస్ట్ క్లాసులో పాస్ అయ్యి తమ ప్రతిభను కనపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ జోషిని, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు రావడానికి తమ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విశేష కృషి కారణమని తెలిపారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

చిప్స్‌లో రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కాలేజిల నుండి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ఐపిఎ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.వి.నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, ఐపిఎ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్ డాక్టర్ ఎస్.విద్యాధర, స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సుమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మొదటి రెండు స్థానాల్లో విజేతలైన విద్యార్థులను హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. డాక్టర్ టివి నారాయణ మాట్లాడుతూ హెల్త్ సెక్టార్‌లో ఫార్మసీ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, అంతేకాకుండా ఆ రంగం ఉన్నత స్థాయిలో ప్రపంచంలో అన్ని దేశాలతో పోటీపడి మన దేశం ముందు ఉందని చెప్పారు. కరోనా సమయంలో దేశంలోని ఫార్మా కంపెనీలు వారి కీలకపాత్ర పోషించి, రోగులకు అవసరమైన ముందులను, వ్యాక్సిన్‌ను సమయానికి ప్రపంచ స్థాయిలో అందించారని తెలిపారు. ఫార్మసీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవటంలోనే విజయం ఉందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు.

ఎన్నికల కౌంటింగ్ అయ్యే వరకూ
పెట్రోలు, డీజిల్ విడిగా ఇవ్వొద్దు : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికలలో చివరి ఘట్టం అయిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకులు ఎట్టి పరిస్థితుల్లో నేరుగా వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ నింపాలని రిటైల్ షాపుల వారికి కొన్ని రోజులపాటు పెట్రోల్ డీజిల్ విక్రయాలు నిలిపివేయాలని జెసి ఎ శ్యాంప్రసాద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. పెట్రోలు, డీజిల్‌ను విడిగా బాటిళ్లలో, క్యాన్లలో నింపరాదని నిబంధనలు ఉల్లం ఘించిన బంకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిటైల్ షాపు లైసెన్స్ లు రద్దు చేయడం వంటి చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉప్పలపాడులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోనిఉప్పాలపాడు లో సీఐ సుధాకర్ మరియు ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్టన్ సెర్చ్ నిర్వహించారు. గుంటూరు సౌత్ కోస్టల్ ఐజి ఉత్తర్వులు మేరకు ఈరోజు కార్టన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ తెలిపారు. గ్రామం లో కొత్త వ్యక్తులు మరియు అనుమానాస్పద వస్తువులేవైనా ఉంటే తమకు సమాచారం తెలియ జేయాల్సిందిగా ప్రజలను కోరారు,అల్లర్ల కు పాల్పడే వాళ్ళ పై కఠిన చర్యలు ఉంటాయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు, ఈ కార్యక్రమం లో రూరల్ సీఐ సుధాకర్, ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి, మరియు ఏఎస్ఐ కోటిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం వెలుగుచూసింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు, తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన పినపోతు కనకా రావు, మంగ దంపతులకు ముగ్గురు ఆడ సంతానం తో పాటు ఒక బాబు ఉన్నారు. వారి పెద్ద కుమార్తె దేవిని పన్నెండేళ్ల క్రితం ఏనుగుపాలెంకి చెందిన చింతల శ్రీనివాస రావు కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి 9,5 సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే రోజు వెళ్లినట్లే చింతల శ్రీనివాసరావు భార్య దేవి (30) శుక్రవారం తమ గేదేలను మేపటానికి పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో పొలానికి వెళ్లిన తన భార్య ఇంటికి రాలేదని భర్త శ్రీనివాస రావు శుక్రవారం సాయంత్రం వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం గ్రామ శివారులోని ఒక నీటికుంట లో ఆమె మృతదేహం కనబడటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అదించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో మతదేహాన్ని పట్టణ సిఐ సాంబశివరావు పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

తగ్గిన పోలింగ్.. ఆందోళనలో అభ్యర్థులు

- బూత్ స్థాయిలో కొన్ని చోట్ల 30 శాతం తగ్గిన ఓట్లు
- డబ్బు పంపణీ చేసినా ఓట్లు ఎందుకు పడలేదని అభ్యర్థుల ఆరా

ఫైల్ ఫోటో

ప్రజాశక్తి -గురజాల

ఓటర్ల జాబితా చేతిలో ఉంది... ఓటుకు నోటు పంపిణీ చేశాం.. ఇక గెలుపు తమదేనని ప్రధానపార్టీల నాయ కులు అనుకుంటున్నారు. అయితే, ఓటుకు ఇచ్చిన నోటు లెక్కలు, వస్తాయనుకునే ఓట్ల లెక్కలు వేసుకుంటున్న నియో జకవర్గంలోని నాయకులు, అభ్యర్థులు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఏ ప్రాంతంలో ఎవరు ఓటేసేం దుకు రాలేదు అన్న లెక్కలను బూత్ స్థాయి నుంచి ఆరా తీస్తున్నారు. బూత్ స్థాయిలో కొన్ని చోట్ల 30 శాతం ఓట్లు తగ్గడంపై ఆందోళన చెందుతున్నారు. తగ్గిన ఓట్ల కోసం వారి వారి లెక్కల ప్రకారం ఒక్కో పార్టీకి సుమారు రెండు కోట్ల రూపాయలు చొప్పున ఖర్చు అయింది.

పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారంతా ఉదయం 6:30 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ అంతా ఉద యం 12 గంటలలోపు పూర్తయిందని రాజకీయ పక్షాల విశ్లేషణగా ఉంది. స్థానికులు మాత్రం తర్వాత ఓటు వేద్దాం అని ఊరుకున్నారు. వీరిలో మరి ఆల స్యంగా, పోలింగ్ సమయంలోపు బూత్‌కి వెళ్ళిన వారు, రాత్రి పది గంటల వరకు క్యూలో నిలబడి ఓటు వేయాల్సి వచ్చింది. బారులు తీరిన క్యూలో నిలబడే ఓపిక లేని ఓటర్లు మాత్రం వెనుదిరిగారు. ఓ పార్టీ వారు ఓటుకు రూ.2000 పంపిణీ చేయ గా, డ్వాక్రా సభ్యు లకు, ఉద్యోగులకు, వెయ్యి రూపాయల నుంచి రెండు వేల వరకు ఇచ్చినట్టు సమాచారం. నెలరోజుల పాటు బూత్ కమిటీలు నిర్వహణకు రూ.20,000 నుండి రూ.30,000 వరకు ఆయా పార్టీలు ఖర్చు చేశాయి. ఈ లెక్కలన్నీ వేస్తే కోట్ల రూపా యల్లో ఖర్చు తేలింది. అయితే, ఇంకా 20 శాతం వరకు ఓట్ల నమోదు తగ్గడం వారిని అసంతృప్తికి గురిచేసింది. ఇంట్లో ఎవరెవరు ఉన్నారు అంటూ ఆరా తీసి, ఓటరు జాబితాలో వారి పేర్లు చూసుకుని మరి డబ్బులు పంపిణీ చేశారు. గురజాల నియోజక వర్గంలో కొంతమంది ఓటర్లు తమ ఇంట్లో ఇన్ని ఓట్లు ఉన్నాయంటూ, నాయకులను డిమాండ్ చేసి మరి డబ్బులు తీసు కున్నారు. పంపిణీ ఆలస్యమైతే ఆయా ప్రాంతాల్లో బూత్ కమిటీల వారిని నిల దీసిన దాఖలాలు లేకపోలేదు.

ద్వితీయశ్రేణి నాయకులపై అభ్యర్థుల ఆగ్రహం?

ఓట్ల నమోదు తేల్చాక ఇదేం దారుణ మంటూ నేతలు ద్వితీయ శ్రేణి నాయ కులపై అభ్యర్థుల ఆగ్రహం వ్యక్తం చేసి నట్లు తెలిసింది. కొన్నిచోట్ల ఏ వార్డులో ఎవరు ఓట్లు వేయలేదనే గణాంకాలను రహస్యంగా సేకరిస్తు న్నారు. గురజాలలో కొన్ని వార్డుల్లో 70 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. చనిపోయిన, తొల గించిన, బూత్ మారిన ఓటర్లు ఎవరెవరు అనే విషయం తెలుసు కుంటు న్నారు. ఎందుకు ఓట్ల శాతం తగ్గింది అంటూ అంచనాలు వేస్తున్నారు. ఖర్చు పెట్టిన సొమ్ము కోట్ల రూపాయల్లో ఉండగా, 30 శాతానికి పైగా కూడా ఓట్లు రాలేదని కొంతమంది అభ్యర్థులు వాపోతున్నారు.

గెలుపోటములపై బెట్టింగ్‌ల జోరు

- పట్టణ, నియోజకవర్గంలో బెట్టింగ్ రాయుళ్లు
- లంబాడి కాలనీ, వడ్డెరకాలనీ, రాగన్నపాలెం, సంజీవ నగర్, మద్ది నగరంతో పాటు పల్లెలో కూడా
- వెయ్యి నుంచి లక్షల రూపాయల్లో బెట్టింగ్‌లు డబ్బు అందుబాటులో లేని వాళ్లు ఆస్తుల తాకట్టు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి, ఎన్నికలు అయిపోయిన తర్వాత పట్టణ, నియోజకవర్గం లోనూ బెట్టింగ్ రాయుళ్ళ జోరు పెరిగింది. పట్టణంలో లంబాడి కాలనీ, వడ్డెరకాలనీ, రాగన్నపాలెం, సంజీవ నగర్,మద్దినగరం తదితర ప్రాం తాలే కాకుండా చుట్టూ ఉన్న పల్లెల్లో కూడా బెట్టింగుల జోరు జోరుగా సాగుతోంది. బెట్టింగ్ జోరు పోలింగ్‌కు ముందు నుంచ మొదలు కాగా ఓటింగ్ ముగిశాక తార స్థాయికి చేరింది. జగన్ ఐ ప్యాక్ వైసిపికి 151 కన్నా ఎక్కువ స్థానాలు వస్తాయని చెప్పిన నాటి నుంచి బెట్టింగ్‌లు మ రి ఎక్కువయ్యాయి.

ఇక టిడిపి గురించి చెప్పాలంటే.. పోస్టల్ ఓటింగ్, చంద్రబాబునాయుడు మహాసభలకు జనాలు రావడం, రాజధానిలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని బాబు చెప్పిన మాటలతో ఆ పార్టీ శ్రేణుల్లో హుషారు నింపింది. ఓట్ల లె క్కింపు ఇంకా రెండు వారాలుండగా చిలకలూ రిపేట నియోజకవర్గ ప్రధాన పార్టీలకు చెందిన ఒకొక్క ఎమ్మెల్యే అభ్యర్థి పెట్టిన ఖర్చులు సుమారురూ.60 నుంచి 80 కోట్ల వరకు ఉంటుందను కుంటున్నారు. నరసరావు పేట ఎం.పి అభ్యర్థులైతే ఒకొక్కరూ వందల కోట్ల రూపాయల మేరకు ఖర్చు చేసి వుంటారని తెలుస్తోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే అంశాలు మొదలు కొని మె జార్టీపైనా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఆస్తులూ తాకట్టు పెడుతున్నారు ప్రస్తు తం ప్రత్తిపాటి పుల్లారావు టిడిపి అభ్యర్థిగా గెలుస్తారని కొంతమంది రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల లోపు బెట్టింగ్‌లు పెట్టారు. వైసిపి అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు గెలుపుపైనా బెట్టింగ్‌లు ఉన్నాయి. వీటి కోసం ఖాళీ స్థలాలను తాకట్టు పెట్టి డబ్బు తీసుకొస్తున్నారని సమాచారం. కుటుంబ అవసరాల కోసమని, ఆసుపత్రిలో డబ్బు కట్టాలని, చెప్పి ఆయా ఆస్తుల పత్రాలను తాకటు పెడుతున్నారని, వడ్డీ ఎంతైనా ఫర్వాలేదని చెబుతున్న వారు లేకపోలేదు.

వెయ్యి నుంచి లక్షల రూపాయల వరకు బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. డబ్బు అందుబాటులో లేని వాళ్లు తమ ఆస్తులను, దస్తావేజులను నాన్ జ్యుడీషియ ల్ స్టాంప్ పేపర్లపై ఆస్తులకు సంబంధించి అగ్రి మెంట్లు సైతం రాసు కుంటున్నారు. ఈ బెట్టింగ్‌లలో డబ్బు పోగొట్టుకొని పలువురు బికారులైన ఉదంతాలున్నాయి.ఉన్నది పోగొట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడ్డ వారూ లేక పోలేదు. బెట్టింగ్‌ల పేరుతో డబ్బులు చేతులు మారుతున్నా పోలీసులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల కమిషన్, సైబర్ క్రైం విభాగాలు,చోద్యం చూస్తు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి..

గెలుపుపై అభ్యర్థుల ధీమా..

- నియోజకవర్గ ప్రజల్లో ఉత్కంఠ
- పోటీ చేసిన వారిలో వైసిపి, టిడిపి-జనసేన-బిజెపి కూటమి , ఇండియా వేదిక అభ్యర్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. అభ్యర్థుల గెలుపోటములు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నాయి. నియో జకవర్గ స్థాయిలోని మూడు మండలాల్లో ఓట్లు గత ఎన్నికల్లో 83.99 శాతం వస్తే ఈసారి 85 శాతం ఓటింగ్ వచ్చింది. 1.01 శాతం పెరిగింది. నియోజకవర్గ పరిధిలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే తామే గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తు న్నారు. అయితే, ఏ అభ్యర్థి గెలుపొందు తారనే విషయమై ఆయా పార్టీల్లోనూ, నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకుంది. గ్రామీణ ఓట్లు, సంక్షేమ పథకాల వల్ల మహిళల ఓట్లు తమ పార్టీకే వేశారని వైసిపి నేతలు చెబుతున్నారు. అదే, పట్టణ ప్రాంతాల్లో ఓట్లు, ఇతర ప్రాం తాల నుంచి వచ్చిన వారు, పెరిగిన శాతం ఓట్ల శాతం తమదేనని టిడిపి వారు చెప్పు కొస్తున్నారు. 2019లో జరిగిన ఎన్ని కల్లో వైసిపికి ఒక్క చాన్స్, బి.సి.మహిళ, పద కాలు కలసి వచ్చాయి.

తమదే గెలుపంటున్న ముగ్గురు అభ్యర్థులు!

ఈ ఎన్నికల్లో టిడిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత 25 సంవత్సరాలుగా ఇదే నియోజక వర్గంలోని ప్రజలతో కలిసి ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమవేనని చెబు తున్నారు. మార్పు కోరుకుంటున్న వారి ఓట్లు, ముఖ్యంగా యువత ఓట్లు, బిసి ఓట్లు,పెరిగిన ఓటింగ్ శాతం, పట్టణంలో ఓట్లు తమకే వేశారని పుల్లారావు గెలుపు ఖాయమని ఆయనతో పాటు పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

వైసిపి అధిష్టానం ఎన్నికలకు ముందు అభ్యర్థులను మార్చారు. ఇక్కడ కొత్తగా పార్టీ ఇన్‌చార్జిగా ఉండి, ఎన్నికల్లో పోటీకి ప్రచారం చేసుకున్న మల్లెల రాజేష నాయుడిని మార్చడం, ఆ స్థానంలో గుం టూరు మేయర్ గా ఉన్న కావటి శివనాగ మనోహర్ నాయుడిని అభ్యర్థిగా ప్రకటిం చారు. ఈ నియోజక వర్గానికి ఆయన పూర్తిగా కొత్త కావడంతో మొదట్లో స్థానిక నేతలపై ఆధారపడాల్సి వచ్చింది. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు, ప్రజల్లో సిఎం జగ న్ పై ఉన్న అభిమానమే తమ గెలుపునకు తోడ్పడుతుందని భావించారు. ఇంటిం టకీ తిరిగి విస్తృతంగా ఓటర్లను కలి శారు. నియోజకవర్గంలో ఇండియా బ్లాక్ అభ్య ర్థిగా కాంగ్రెస్ నుంచి ఎం.రాధాకృష్ణ పోటీ చేశారు. ప్రజల కష్ట సుఖాలు, సమస్యలు తెలిసిన వ్యక్తి. కూట మిపై ముఖ్యంగా బిజెపిపై ఉన్న ముస్లిం లకు ఉన్న వ్యతిరేకత, ఉమ్మడి కమ్యూ నిస్టుల సహకారం తమ గెలుపు నకు అవకాశం ఉందనే అభిప్రాయం ఇం డియా వేదిక నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు పార్టీలు వారు ఎవరికి వారే తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న డిఇఒ శైలజ, తదితరులు

ముగిసిన సిబిఎస్ఈ ఉపాధ్యాయుల శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

సిబిఎస్‌సి పాఠశాలల రాష్ట్రవ్యాప్త శిక్షణ కార్యక్రమంలో భాగంగా గుంటూరు, బాపట్ల జిల్లాలలోని సీబీఎస్సీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇంగ్లీషు, సోషల్, బయాలజీ ఉపాధ్యాయులకు స్ట్రక్చరల్ లెసన్ ప్లాన్, పెడగాజి అంశాలపై స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గత రెండ్రోజుల నుండి జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా విద్యాశాఖధికారి పి.శైలజ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థి అని, బోధించే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. సిమ్యాట్ నుంచి వచ్చిన రాష్ట్ర పరిశీలకులు ఏ.సుహాసిని మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలు మెరుగవుతాయని అన్నారు. కోర్స్ ఇంచార్జ్ వి.వెంకటేశ్వరరావు శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్ఎఫ్ఈ కోఆర్డినేటర్ తోట వీరయ్య మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని, గుంటూరు జిల్లాలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే ఉపాధ్యాయులకు 20, 21వ తేదీలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా సబ్జెక్టులు బోధించే గుంటూరు, బాపట్ల జిల్లాల ఉపాధ్యాయులు ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాలలో హాజరవ్వాలని తెలియజేశారు.కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, సీబీఎస్ఈ స్కూల్స్ జిల్లా ఇన్‌చార్జి గుత్తా శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నేలలో సేంద్రీయ పదార్థం పెంచాలి

మాట్లాడుతున్న రామచంద్రం

ప్రజాశక్తి-గుంటూరు

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగువిధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై పుల్లడిగుంట వద్ద కొర్నెపాడు గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో జరుగుతున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభం అయ్యింది. రిటైర్ వ్యవసాయ శాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం, ప్రాకతిక రైతు మీసాల రామకృష్ణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పొల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవే అని, కొన్ని సార్లు రైతులు రసాయనాలు పిచికారి చేసిన వెంటనే కూరగాయలు, ఆకు కూరలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచడం వలన వాటిలో ఉండే విష రసాయనిక అవశేషాలు ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు. దీనికి ప్రత్యామ్నాయం సేంద్రియ పద్ధతులలో కూరగాయలు, ఆకుకూరలు పండించటమే పరిష్కారమన్నారు. బొప్పాయి, అరటి పంటలు సేంద్రియ సాగుకు అనుకూలంగా ఉంటాయని అన్నారు. శిక్షణలో భాగంగా ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన గోశాల, కట్టె గానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు, ఘనజీవామృతం తయారీ విధానం ప్రత్యక్షంగా చూపించడం జరి గింది. రాబోయే రెండు రోజులలో తేనెటీగల పెంపకం, బిస్కెట్లు, టమాట సాసు, చిరు ధాన్యాలతో వంట కాలు లాంటి వాటిని ప్రత్యక్ష ంగా చూపించ డం తోపాటు రైతుల పంట లకు విలువ పెంపు దల పై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ఘనంగా మదర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి ఆర్యవైశ్య మహిళా సంఘం, ఫైవ్ పెర్టిలిటి ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మదర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 30 మందికి సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ప్రముఖ వైద్యులు పి గిరిజ, బి సౌమ్య, పి ఆదినారాయణ, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు నేరెళ్ల పద్మజ, కార్యదర్శి మాజేటి శ్రీదేవి, కోశాధికారి ఎస్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

23న బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని గౌతమ్ బుద్ధ రోడ్డులోని వైష్ణవి కళ్యాణ మండపంలో 23న సాయంత్రం 6 గంటలకు మాన వతా వేదిక ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు జరుగుతు న్నట్లుగా వేదిక కన్వీనర్ గోలి మధు శనివారం తెలిపారు. ఈ వేడుకల్లో సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ అరవింద్, అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి సీతామహాలక్ష్మి పాల్గొని ప్రసం గిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో వివిధ ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

26న ఆళ్లకు అన్నమయ్య పురస్కారం

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన కవి రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు అన్నమయ్య పుర స్కారానికి ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్ల చీమ నపల్లి గ్రామానికి చెందిన సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, తిరుపతికి చెందిన ఏ.ఎస్. ఫౌండేషన్ సంస్థ సం యుక్తంగా ఆయా సంస్థల ఏడవ వార్షికోత్సవం సంద ర్భంగా కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి అన్న మయ్య పురస్కారాలను ఈ నెల 26 న బైరెడ్డిపల్లి గ్రామం లో ప్రధానం చేయనున్నారు. ఆళ్ల నాగేశ్వరరావు కూడా ఈ పురస్కారానికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారని ఆయన వెల్లడించారు. నిర్వాహక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నుంచి ఈ మేరకు శనివారం ఆహ్వానాన్ని అందుకున్నట్లు ఆళ్ల తెలిపారు.

సంక్షేమ పథకాలు వైసిపిని గెలిపిస్తాయి

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గానికి వైఎస్ఆర్సిపి అభ్యర్థి మురుగుడు లావణ్య 3000 నుండి, 5000 మెజార్టీతో నారా లోకేష్ పై విజయం సాధించడం ఖాయమని వైఎస్ఆర్సిపి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి పి శ్యాంబాబు శనివారం తెలిపారు. ఒకవేళ లోకేష్ గెలిస్తే టిడిపి పార్టీది కాదని అన్నారు. లావణ్య గెలుపునకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే కారణమని అన్నారు. అలాకాకుండా లోకేష్ గెలిస్తే మాత్రం వైయస్సార్సీపీలో నియోజకవర్గ పరిధిలో ఉన్న పెత్తందారుల వలనే నని అన్నారు. ఈ విషయాలపై ఎన్నికల ఫలితాలు తర్వాత ఆధారాలతో సహా బయట పెడతానని తెలిపారు.

ప్రజాశక్తి - తుళ్లూరు :తాడికొండ అసెంబ్లీ స్థానం వైసిపిదేనని ఆ పార్టీ ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ సందీప్ దీమా వ్యక్తం చేశారు. శనివారం తుళ్లూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం మాదిరిగా ప్రజలు పెద్ద సంఖ్యలో వైసిపికి ఓట్లు వేశారని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైసిపికి ఓట్లు వేశారని అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయ మన్నారు. ఎన్నికలలో టిడిపి నాయకులు భయ పెట్టాలని చూశారని, వారి తాటాకు చప్పుళ్ళకు వైసిపి నాయ కులు, కార్యకర్తలు బెదరకుండా ఎదురొడ్డి పోరాడారని చెప్పారు. కౌటింగ్ రోజు అల్లర్లు సృష్టించాలని టిడిపి నాయకులు పన్నాగం పన్నుతున్నారని, వారి ఆటలు సాగవని అన్నారు.

చికిత్స అందజేసిన వ్యక్తితో స్వాతి గౌడ్

విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి మంగళగిరి

అనారోగ్యం పాలైన వ్యక్తికి చికిత్స చేయించడంతో పాటు అతనికి ఎవరూ లేరని తెలుసుకుని విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వసతి కల్పించారు.వివరాలను ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్ శనివారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంగళగిరి కుప్పరావు కాలనీ 9వ లైన్‌లో దిక్కు తోచని స్థితిలో, కదలలేని అనారోగ్యంతో అనాథగా నడిరోడ్డు మీద నివాసం ఉంటున్న దామర్ల కృష్ణయ్యకు తగిన వైద్యం అందజేశామని స్వాతి తెలిపారు. పూర్తిగా తగ్గిన తర్వాత నవులూరిలోని శివశక్తి ఆశ్రమంలో ఆయనకు నివాసం ఏర్పాటు చేశామన్నారు. నిరుపేదలకు విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఎప్పుడు అండ దండగా ఉంటుందని నిరాశ్రయులైన వృద్ధులను, చిన్న పిల్లలను ఆశ్రమంలో తమ వంతు బాధ్యతగా చేర్పిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఎటువంటి అనారోగ్యం, మరియు వృద్ధాప్యం వల్ల నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న వారు సహాయం కొరకు తమని సంప్రదించవచ్చునని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొడ్డేటి రమేష్, కాటూరి శ్యామ్, స్థానికులు శివ తదితరులు పాల్గొన్నారు.

'వైసిపికి డిపాజిట్లు కూడా రావు'

ప్రజాశక్తి-తాడేపల్లి

జూన్ 4వ తేదీన రానున్న ఎన్నికల ఫలితాల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్ళం బాపిరెడ్డి అన్నారు. శనివారం తాడేపల్లి కళ్ళం బాపి రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ వైసీపీకి కొన్ని ప్రాంతాల్లో కనీసం డిపాజిట్లు కూడా రావని అన్నారు. రాష్ట్రంలో 85 శాతం శాతం ఓట్లు వేశారని అన్నారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలో 87శాతం ఓట్ పర్సంటేజ్ రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. నారా లోకేష్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి పేద ప్రజల పక్షాన నిలిచారని అన్నారు. మంగళగిరిలో నారా లోకేష్ 50వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని అరాచకాలు సృష్టించినా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్ళం బాపిరెడ్డి, మంగళగిరి నియోజకవర్గం తెలుగు రైతు ఉపాధ్యక్షులు బుర్ర ముక్కు శ్రీనివాసరెడ్డి, టిడిపి తాడేపల్లి పట్టణ ఆర్గనైజర్ సెక్రెటరీ మండవ గోపాలరావు, సీనియర్ నాయకులు మున్నంగి సంజీవరెడ్డి,బత్తుల తిరుపతయ్య,తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు శాఖా గ్రంధాలయం ఆధ్వర్యంలో శనివారం వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటైంది.శిబిరాన్ని జిల్లా గ్రంధాలయశాఖ కార్యదర్శి వి సుబ్బరత్నమ్మ తనిఖీ చేశారు. శిబిరంలో కేవలం తొమ్మిది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని, ఈసారి ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలని గ్రంధాలయాధికారి టి గిరిధర్ కుమార్ కు సూచించారు.

వెలగపూడిలో రైతుల దీక్షలు

1614వ రోజుకు అమరావతి దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి నిర్మాణం జరగాల నేది ప్రజల ఆకాంక్షని, ఏ ప్రభుత్వమైనా ఆ దిశగా చర్యలకు ఉపక్రమించే వరకు పోరు ఆగదని రైతులు స్పష్టం చేశారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు శనివారంతో 1614వ రోజుకు చేరాయి. వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం, తుళ్లూరు తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

వర్షాకాలంలో కీటకాల బెడద

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్షాకాలం ప్రారంభమైందంటే మానవాళికి మేలు చేసే కీటకాలకన్నా కీడు చేసే కీటకాలే ఎక్కువగా పుట్టుకొస్తాయి. ఇటీవల కురుస్తున్న చెదురు ముదురు వర్షాలకి వివిధ రకాల కీటకాలు సాయం సమయంలో లైట్లు వేసిన వెంటనే ఆయా ప్రాంతాల్లోని ఇళ్లను ఆక్రమిస్తున్నాయి. వీటిలో రకరకాల అంటూ వ్యాధులు జబ్బులు వ్యాపింప చేసే కీటకాలతో పాటు కుట్టే కరిచే కీటకాలు రక్తం పీల్చే కీటకాలు కూడా ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన అనంతరం జంతుశాస్త్రంలో వర్గీకరించబడిన అది పెద్ద శాస్త్ర విభాగం కీటక శాస్త్రం (ఎంటమాలజీ). వ్యవసాయ రంగంలో చేర్చి మేలు చేసే కీటకాల అభివృద్ధికి కీడు చేసే కీటకాల అంతానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. మానవ పర్యావరణాన్ని సంబంధించిన సంబంధాన్ని ఈ విభాగం అధ్యయనం చేస్తుంది. ఇటీవల సంభవిస్తున్న పరిణామాలు దృష్ట్యా మేలు చేసే కీటకాలు

వర్షానికి ట్యూబ్‌లైట్ చుట్టూ చేరిన కీటకాలు

క్రమంగా నశిస్తున్నాయి. పరాగ సంపర్కం ద్వారా ఆహార ఉత్పత్తికి తోడ్పడే సీతాకోక చిలుకలు తూనీగలు తేనెటీగలు లాంటి కీటకాలు వాతావరణంలో మార్పు పెరుగుతున్న కాలుష్యం పురుగు మందుల వాడకం వలన అంతరించి పోతున్నాయి. నష్టం కలిగించే కీటకాల్లో ప్రాణాంతక కీటకాలైన దోమలు ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. ఏడు రకాల దోమలు మలేరియా, డెంగీ ఎల్లో ఫీవర్ లాంటి ప్రాణాంతక జబ్బులను వ్యాపించచేస్తున్నాయి. కీటకాల నివారణకు సహజ పద్ధతులు అవలంబించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. పరిశుభ్రత పాటించి నట్లయితే కీటకాలను కొంతమేర నియంత్రించ వచ్చుందని తెలిపారు . పరిసర ప్రాంతాల్లో నీటి నిలువలు లేకుండా చూడటం పొదలు కంపలు పెరగకుండా జాగ్రత్తగా చూడటంతో పాటు ఇంటిల్ల పాలిట మురుగునీరు నీరు నిల్వ ఉండకుండా చూడాలని తదతర జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. పశువులు కూడా కీటకాల బారిన పడతాయని తెలిపారు. వర్షాకాలంలో పశువులపై దోమలతో పాటు రకరకాల కీటకాలు దాడి చేసే ప్రమాదం ఉన్నదని వాటి వలన పశువులకు రక్తహీనత గాలికుంటు వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. దోమ కాటు వలన గేదెలు ఇచ్చే పాలు పరిమాణం కూడా తగ్గుతుందని పాలు పితికేటప్పుడు కీటకాలు దోమలు వాటిపై దాడి చేసినట్లయితే కాళ్లతో తన్నటం తోకలు ఆడించటంతో సక్రమంగా పాలు ఇవ్వమని వారు తెలిపారు. గేదెలను కట్టే ప్రాంతంలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు గేదెల దగ్గర శుభ్రం చేయాలని వారు తెలిపారు.

ఈవిఎంల భద్రతపై పోలీసులతో మాట్లాడుతున్న ఇంచార్జ్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టంగా భద్రతా ఏర్పాటు

కౌంటింగ్ కేంద్రం పరిశీలించిన ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం ఇవిఎం, వివిప్యాట్‌లు భద్రపరచిన జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలను శనివారం జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర ఆకస్మికంగా తనిఖీలు చేసి, భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి తగిన సూచనలు సలహాలు చేసి పలు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా సంబంధిత లాగ్ బుక్ లో సంతకాలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత విషయంలో ఎస్‌పితో కలసి కార్యాచరణ రూపొందించామన్నారు. పల్నాడు జిల్లాకు చెందిన 7 అసెంబ్లీ, 1 పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో ఆయా ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలపై అదనపు సూచనలు చేశారన్నారు. ఈ నేపద్యంలో రాజకీయ హింసకు సంబంధించిన ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా, సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, అధికారులకు ముందస్తు సమాచారం అందజేయలని కోరారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూము వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ప్రాంతంలో మూడంచెల భద్రత ను ఏర్పాటు చేసి, సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టు పక్కల 144 సెక్షన్ అమల్లో ఉందని, ప్రజలు ఎవరూ సదరు కాలేజీ చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు డిఎస్పీ పాల్గొన్నారు.

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ కె రాజ్య లక్ష్మి

కౌంటింగ్ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పోస్టల్ ఓట్ల లెక్కింపుపై అప్రమ త్తంగా ఉండాలని జిఎంసి అడిషనల్ కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్య లక్ష్మి తెలిపారు. శనివారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భం గా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, కావున అభ్యర్థులకు ఆయా వివరాలు అందించాలన్నారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన అధికారులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులు అందచేయాలని, సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్‌రూమ్ నుండి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోకి వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్‌లిస్ట్ సిద్ధం చేయాలన్నారు. టేబుళ్ళ వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, డిజిటల్ స్క్రీన్ ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఈఈలు కొండారెడ్డి, కోటేశ్వరరావు, సూపరింటెండెంట్లు వెంకటరామయ్య, సాంబశివరావు, పద్మ, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిబిరం

వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాయంలో ఈనెల 15వ తేదీ నుండి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. శనివారం శిబిరంలో పిల్లలకు ఇంగ్లీషు సబ్జెక్టులో పద ఉచ్చారణ(ప్రనౌన్షియేషన్), స్పెల్లింగ్ రాయగలిగేలా కొని పదాలు రాయించారు. తర్వాత సైన్స్‌లో జ్ఞానేంద్రి యాలు వాటి ప్రాముఖ్యత గురించి పిల్లలకు వివరించారు. అనంతరం పిల్లలు కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అడల్ట్ బిసిజి వ్యాక్సిన్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శనివారం వైద్యాధికారులు, స్పెషలిస్టు డాక్టర్లతో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వాక్సినేషన్‌లో గుంటూరు జిల్లా వెనుకబాటుకు గల కారణాలపై సమీక్ష నిర్వహించి, తగు సూచనలు చేశారు. ఈ వాక్సిన్ చేయించుకున్న ప్రతి ఒక్కరినీ 3 నెలలకు ఒకసారి 3 సంవత్సరముల పాటు ఫాలోఅప్ చెయ్యాలని, పోర్టల్‌లో అప్లోడ్ చేసిన వారి అందర్నీ కవర్ చేయాలని, వీలైనంత త్వరగా లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు తక్కువగా ఉన్న కేంద్రాలు, కాన్పు కేసులు నమోదుకాని కేంద్రాల డాక్టర్లను రివ్యూ చేసి, గల కారణాలు తెలుసుకొని వాటిని ఇంప్రూవ్ చేయాల్సిన ఆవశ్యకతను, 108 వాహనాల సేవలను ఉపయోగించుకోవాల్సిన ఆవశ్యకతను, ట్యూబెక్టమీ మీద శిక్షణ పొందిన డాక్టర్లు వెంటనే ఆపరేషన్లు మొదలు పెట్టాలని, ఎలాక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ అప్డేషన్‌కు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో, పురుష ఆరోగ్య కార్యకర్తల సేవలు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి అధికారి డాక్టర్ దాసరి.శ్రీనివాసులు, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కే.వి.సుబ్బరాజు, డిపియంఒ డాక్టర్ సిహెచ్. రత్నమన్మోహన్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఈ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనన్ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు జడ్‌పి హైస్కూల్

జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలను ప్రభుత్వం ప్లస్ టు కళాశాల (కోఎడ్యుకేషన్)గా అనుమతించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ శనివారం మీడియాకు తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం నుండి జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసి కోర్సులను ఇంగ్లీషు మీడియంలో ప్రారంబిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, తరగతులు జూన్ 1 నుండి ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు క్లాస్ పుస్తకాలు తదితరసౌకర్యాలు ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మీ దుర్గ తెలిపారు. విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించి ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎపిపిఎస్‌సి గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై, మెయిన్స్ పరీక్షలకు సిద్ధం అవుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలియశారు. మే 23వ తేదీలోగా దరఖాస్తులు అందచేయాలని, 60 మంది అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందచేస్తామన్నారు. గతంలో బిసి స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 39 మంది అభ్యర్థులతోపాటు ప్రిలిమినరీలో అర్హత సాధించిన ఇతర బిసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, డిగ్రీ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు(తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్షలోపు మాత్రమే), గ్రూప్-2 హాల్ టిక్కెట్, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ పోటోలు జత చేసి ఈనెల 23వ తేదీలోగా గుంటూరు రాజాగారితోటలోని బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందచేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 0863-2358071 నంబరులో సంప్రదించాలన్నారు.

హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ వెంకటగిరి, తిరుపతి వారు పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు వి.వనజ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు విద్యా సంస్థకు ఏపీలో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో నాలుగు సీట్లకు మూడేళ్ల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ ఏడాది జులై 1 నాటికి బిసి, జనరల్ కేటగిరీ వారు 15 నుండి 23 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 15-25 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ఇంటర్ ఎంపిసి, ఒకేషనల్(టెక్స్‌టైల్), ఐటిఐ రెండేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా డిప్లొమా రెండో సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 1 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు, ప్రవేశాలు, ఇతర వివరాల కోసం www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

టిఎస్‌ఈఎపి సెట్ ఫలితాల్లో సత్తా చాటిన భాష్యం విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ ఈఎపి సెట్-2024 ఫలితాల్లో భాష్యం విద్యార్థులు సత్తా చాటారని ఆ సంస్థ ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి స్టేట్ 5వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 11వ ర్యాంకు, కె.హర్షిత 13వ ర్యాంకు, కె.మనీష్‌చౌదరి 28వ ర్యాంకు, కె.ప్రభాస్ 31వ ర్యాంకు, టి.మునికార్తీక్ 58వ ర్యాంకు, పి.శ్యామ్ 63వ ర్యాంకు, ఎ.గణేష్‌దత్తా 93వ ర్యాంకు, ఎం.శ్రీచరిత సాయి 94వ ర్యాంకు, డి.పూజ 97వ ర్యాంకు, కె.ఆర్.ఎస్.వి.సుమన్విత 100వ ర్యాంకు వంటి వందలోపు 12 ర్యాంకులు సాధించి, భాష్యం ది బెస్ట్ అని నిరూపించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష్యం ఐఐటీ జెఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఈఎపి సెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం ఛైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ యం.హనుమంతరావు అభినందనలు తెలిపారు.

ఎం సాయి యశ్వంత్ రెడ్డి
ఇంజినీరింగ్ 13వ ర్యాంకు

కెఆర్ఎస్‌వి సమన్విత
మెడికల్ అండ్ ఫార్మ 100వ ర్యాంక్

కె హర్షిత
ఇంజినీరింగ్ 11వ ర్యాంకు

ఎం శ్రీ చరిత సాయి
అగ్రికల్చర్ అండ్ ఫార్మ94 ర్యాంక్

ఎం సాయి జస్వంత్ రెడ్డి
అగ్రికల్చర్ అండ్ ఫార్మ 65 ర్యాంక్

తంగ ముని కార్తీక్
అగ్రికల్చర్ అండ్ ఫార్మ 58 ర్యాంక్

కె ప్రభాస్
ఇంజినీరింగ్ 31వ ర్యాంకు

కె మనీష్
ఇంజినీరింగ్ 28వ ర్యాంకు

కె హర్షిత
ఇంజినీరింగ్ 13వ ర్యాంకు